నవోదయ పరీక్షకు ఏర్పాట్లు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 19: జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం పకడ్బందీగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని అన్నారు. దివ్యాంగులకు అదనంగా 30 నిమిషాల సమయం కేటాయిస్తామని అన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 30 నిమిషాల ముందుగానే చేరుకోవాలని సూచించారు.



ఆర్లబండలో రథశాల నుంచి వైసీపీ నాయకులు లాగిన రథం

ఆర్లబండ మఠంపై

పీఠాధిపతి అనుమతి లేకుండా రథాన్ని బయటకు లాగిన వైనం

వైసీపీ నాయకుల పెత్తనం..!

కోసిగి, జనవరి 19: మండల పరిధిలోని ఆర్లబండ గ్రామంలో వెలసిన సద్గురు వెంకవధూత, అంబాదేవి శాంభవి దేవి మఠంపై గ్రామ వైసీపీ నాయకులు పెత్తనం చెలాయించాలని చూస్తున్నారు. ఇందులో భాగంగానే పీఠాధిపతి అనుమతులు లేకుండా శాంభవి దేవి రథాన్ని రథశాల నుంచి బయటకు లాగేశారు. దీంతో వైసీపీ నాయకుల తీరుపై మఠం పీఠాధిపతి మర్రిస్వామి తాతతోపాటు ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25న శాంభవిదేవి రథోత్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. అయితే ఈ ఏడాది గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మఠంపై పెత్తనం కొనసాగించాలని, అన్ని కార్యక్రమాలు తమ కనుసన్నల్లో సాగాలని చూస్తున్నారు. ఇందులో భాగంగానే పీఠాధిపతికి తెలియకుండా రథాన్ని బయటకు లాగారు. ఇలా చేయడంపై భక్తులు ఎస్ఐ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం ఆర్లబండలో చర్చలు జరిపారు. గ్రామ వైసీపీ నాయకులపై చర్యలు తీసుకున్న తర్వాతనే రథోత్సవ కార్యక్రమం గురించి మాట్లాడతామని పీఠాధిపతి ఎస్ఐకి స్పష్టం చేసినట్లు సమాచారం. రథోత్సవం మరో నాలుగు రోజుల్లో ఉండగా ఎలాంటి ఏర్పాట్లు కూడా చేయడం లేదు. ఎక్కడి సామాన్లు అక్కడే రథశాల మైదానంలో మూలకు పడి ఉన్నాయి. ఈ క్రమంలో రథోత్సవం ఎప్పటిలాగే జరుగుతుందో లేదో వేచి చూడాలి మరి.



శాంభవీదేవి



ఆర్లబండలో వైసీపీ నాయకులు మూలన పెట్టిన రథశాల సామగ్రి



వినతి పత్రం ఇస్తున్న ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు

ఆర్‌యూపై అవగాహన ఉంది

- వర్శిటీలోని సమస్యలు పరిష్కరిస్తా
- విద్యా ప్రమాణాలు పెంచుతా..
- ఉప కులపతిగా బాధ్యతలు తీసుకున్న సుధీర్ ప్రేమ్ కుమార్



రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా బాధ్యతలు చేపడుతున్న సుధీర్ ప్రేమ్ కుమార్

కర్నూలు(అర్బన్), జనవరి 19: రాయలసీమ యూనివర్సిటీపై తనకు పూర్తిగా అవగాహన ఉందని కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఉప కులపతి బెల్లం సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఉర్దూ వర్శిటీ ప్రొఫెసర్ పి. ఫజలూర్ రహమాన్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యామండలిలో పని చేయడం వల్ల యూనివర్సిటీ ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. అందరితో సమన్వయంతో పని చేసేందుకు అవసరమైన వాతావారణాన్ని కల్పిస్తానని అన్నారు.. విద్యా ప్రమాణాలు పెంచే దిశగా అవసరమైన కోర్సులను ప్రవేశ పెట్టేందుకు చర్యలు చేపడతానని తెలిపారు.

అంగన్‌వాడీలు అక్కచెల్లెళ్లు కాదా ?

- రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి
- లెంపలు వేసుకుని అంగన్‌వాడీల వినూత్న నిరసన

కర్నూలు(హాస్పిటల్), జనవరి 19: మహిళలను అక్క చెల్లెళ్లుగా సంబోధించే సీఎం జగన్ అంగన్‌వాడీ ఉద్యోగుల పట్ల ఎందుకు ఇంత క్రూరంగా వ్యవహరిస్తున్నారని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అభయహస్తం, అమ్మఒడి పేర్లతో వేలకోట్ల రూపాయలు ఇస్తూ ఆదుకుంటున్నామని చెబుతున్నా సీఎం రాష్ట్రంలో ఉన్న 1.6 లక్షల మంది అంగన్‌వాడీ మహిళలకు 39 రోజులైనా ఎంత వేతనం పెంచేదీ చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. శుక్రవారం దీక్షలో అంగన్‌వాడీలు లెంపలు వేసుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఇందులో నాగమణి, కవిత, దానమ్మ, ప్రియాంక, రాధ, చిట్టెమ్మ, మాదమ్మ, పద్మావతి, సువర్ణ, రాధిక, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలకపల్లి రవి



నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆర్థిక బకాయిలు

విడుదల చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్
- జిల్లా పరిషత్ ఎదుట నిరసన

కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలపై హామీలతో కాలయాపన చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తున్నందుకు నిరసనగా శుక్రవారం జిల్లా పరిషత్ ఎదుట చెవిలో పువ్వులు పెట్టుకొని మోకాళ్లపై వినూత్నంగా నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు యూఆర్‌పి. రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సురేష్‌కుమార్ మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఈఎల్ఎస్ ద్వారా ఉద్యోగులు దాచుకున్న డబ్బులను తిరిగి చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నవీన్, సహాధ్యక్షుడు హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు చేసి కార్యక్రమాలు చేశా

నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్



కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: 'నియోజవర్గంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలన్నీ అప్పులు చేసి నిర్వహించా... ఇప్పుడు అధికారం లేకుండా కేవలం పార్టీ కార్యక్రమాలనే చూసుకోవాలని అంటున్నారు..' అని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ వైసీపీ అధిష్టానం తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా వైసీపీ విడుదల చేసిన నాలుగో జాబితాలో నందికొట్కూరు(ఎస్సీ) నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కడప జిల్లాకు చెందిన డాక్టర్ సుధీర్‌కు వైసీపీ ఖరారు చేసింది. ఈ క్రమంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్ కర్నూలులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నందికొట్కూరు టికెట్ ఈసారి కూడా తనకే వస్తుందని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి తనకు హామీ ఇచ్చాడని తెలిపారు. కానీ ఇప్పుడేమో మరొకరికి టికెట్ ఎందుకు కేటాయించారో అర్థం కావడం లేదన్నారు. ఇతరులకు టికెట్ ఇస్తామని చెప్పి ఉంటే తప్పకుండా సహకరించేవాడినని తెలిపారు. కానీ ఇప్పుడు అధికారం లేకుండా కేవలం పార్టీ కార్యక్రమాలే చూసుకోవాలని వైసీపీ అధిష్టానం చెప్పిందన్నారు. ఆ ప్రతిపాదనను తాను తిరస్కరించానని ఆర్థర్ చెప్పుకొచ్చాడు. కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా ఫోన్లు చేస్తున్నారన్నారు. ఈ నెల 21న నగరంలో జరిగే కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆర్థర్ తెలిపారు.

రివాల్వర్‌తో హల్‌చల్..!

అరెస్టు చేసిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రివాల్వర్, బుల్లెట్లు

పత్తికొండ టౌన్, జనవరి 19: అర్ధరాత్రి వేళ ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి లైసెన్సు రివాల్వర్‌తో గాలిలోకి కాల్పులు జరిపిన ఘటన గురువారం అర్ధరాత్రి పట్టణ శివారులో చోటు చేసుకుంది. పత్తికొండ సీఐ మురళీమోహన్ శుక్రవారం వివరాలను వెల్లడించారు. గురువారం అర్ధరాత్రి మకదల్ నుంచి చెన్నైకు గ్రానైట్ లారీలో శ్రావణ్‌కుమార్ బయలుదేరాడు. పత్తికొండ-ఆదోని రహదారిలో ఉన్న ఉరుకుంద వీరన్న దేవాలయం సమీపాన పంక్చర్ షాపు వద్ద ఆగాడు. అదే సమయంలో వెంకటేష్ వ్యక్తి లారీలో ఉల్లిపాయలను తీసుకెళ్తూ అదే ప్రాంతానికి చేరుకున్నాడు. ఈ సమయంలో లారీల పార్కింగ్ విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో కోపోద్రిక్తుడైన శ్రావణ్‌కుమార్.. వెంకటేష్‌పై రాయితో బలంగా నెత్తిపై కొట్టాడు. దీంతో తీవ్ర ఆవేశానికి గురైన వెంకటేష్ తన దగ్గర ఉన్న లైసెన్సుతో గాలిలోకి రెండు కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఐఐఐటీడీఎంలో తాగునీటి కోసం రూ.22 కోట్లు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 19: కర్నూలు ఐఐఐటీడీఎం క్యాంపస్‌లో తాగునీటి కోసం రూ.22 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనులను నిర్ణయించిన సమయంలో పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు.



పత్తికొండకు

'రా..కదలిరా'

- 25న టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభ
- లక్ష మంది సమీకరణ లక్ష్యం
- సభా వేదిక, పార్కింగ్ స్థలాల పరిశీలన

కర్నూలు (ఆంధ్రజ్యోతి)/పత్తికొండ, జనవరి 19 : రాయలసీమ జిల్లాల్లో వైసీపీని దెబ్బకొట్టి మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునే లక్ష్యంగా చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. కురుక్షేత్రానికి పసుపు సైన్యాన్ని సన్నద్ధం చేస్తూ.. గెలుపు గుర్రాల ఎంపికపై దృష్టి సారించారు. సీఎం జగన్ ప్రజా వ్యతిరేక విధానాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగడుతూ 'రా..కదలిరా' కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే ఈ నెల 25న పత్తికొండకు టీడీపీ అధినేత చంద్రబాబు రానున్నారు.

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల లోక్‌సభ స్థానాలు, 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో వైసీపీ మొత్తం స్థానాలు కైవసం చేసుకొని క్లీన్ స్వీప్ చేసింది. రాబోయే ఎన్నికల్లో దానిని తిరిగి రాయాలనే లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ వ్యూహాలకు పదును పెట్టారు. ఉద్యోగులు, వ్యాపారులు, నిరుద్యోగ యువతలో జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. తాజాగా గ్రామాల్లో కూడా వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెల్లుబుకుతోంది. ఈ తరుణంలో రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఖాతాలో పడే దిశగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. అందులో భాగంగానే 25న పత్తికొండలో నిర్వహించే రా కదలిరా సభలో చంద్రబాబు పాల్గొని ప్రసగింస్తారు. ఈ సభకు లక్ష మంది జన సమీకరణ లక్ష్యంగా శుక్రవారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా పరిశీలకుడు, అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, పత్తికొండ పరిశీలకురాలు పెనుకొండ కవితమ్మ, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కర్నూలు పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజక వర్గాల ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యేలు కె.మీనాక్షి నాయుడు, కోట్ల సూజాతమ్మ, బీవీ జయనాగేశ్వ రెడ్డి, టీజీ భరత్, ఆకెపోగు ప్రభాకర్, కేఈ శ్యాంబాబు, పి.తిక్కారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బత్తిన వెంకటరాముడు సహా తెలుగు మహిళా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముంతాజ్‌బేగం, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఈ.సుకన్యాదేవి సహా ఆయా నియోజకవర్గాల ముఖ్య నాయకులు హాజరయ్యారు. నియోజకవర్గాల వారిగా జన సమీకరణ, సభను విజయవంతం చేసేందుకు ఏ నాయకుడు ఏ బాధ్యత నిర్వర్తించాలో చర్చించి నియోజకవర్గం ఇన్‌చార్జిల వారిగా బాధ్యతలు అప్పగించారు. గత ఏడాది సెప్టెంబరు 9న చంద్రబాబు అక్రమ అరెస్టు తరువాత తొలిసారిగా కర్నూలు జిల్లాకు వస్తున్నారు. దీంతో రా కదలిరా సభను సూపర్ సక్సెస్ చేసే దిశగా ప్రణాళికలు రూపొందించారు.

18 ఎకరాల్లో సభ

25న 'రా..కదలిరా' సభావేదిక పత్తికొండ-ఆదోని రహదారిలో 18 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. వాహనాల పార్కింగ్ కోసం మరో 20 ఎకరాలు ఎంపిక చేశారు. వేదికకు సమీపంలోనే హెలిపాడ్ ఏర్పాటు చేయనున్నారు. కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలు దేవనకొండ రోడ్డు వైపు, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నుంచి వాహనాలు ఆస్పరి రోడ్డు వైపు పార్కింగ్ ఏర్పాటు చేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రజలు సభా వేదిక మైదానానికి చేరుకోవాలి. 1:30 గంటల నుంచి 2:30 గంటల వరకు జిల్లా ముఖ్య నాయకుల ప్రసంగం ఉంటుంది. 2-2.30 గంటల మధ్యలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి సభా వేదికకు చేరుకొని 2:30 గంటల తరువాత బాబు ప్రసంగం ఉంటుందని తాత్కాలిక షెడ్యూలు రూపొందించారు. జిల్లా నాయకులు. నియోజకవర్గం ఇన్‌చార్జిలు సమిష్టిగా కష్టపడి 'రా..కదలిరా' సభను దిగ్విజయం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించామని బీటీ నాయుడు వివరించారు.




సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

బోగస్ ధ్రువపత్రాల భాగోతం!

- పశు సంవర్ధ శాఖ నియామకాల్లో అక్రమాలు
- నోటిఫికేషన్ ముందే భారీగా పుట్టుకొచ్చిన వైనం
- న్యాయం చేయాలంటున్న అర్హులైన నిరుద్యోగులు
- 'బోగస్' అని తేలితే కేసులు నమోదు : జేడీ

పశు సంవర్ధక శాఖలో 2016 నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల నియామకాల్లో స్టేట్ మెరిట్‌సాధించారు. ఉద్యోగ నియామక పరీక్షల్లో వచ్చిన మార్కులకు 'ఇన్ సర్వీస్ కోటా' కింద మరో 15 మార్కులు బోనస్‌గా కలపడంతో ఆయన ఉద్యోగం సొంతం చేసుకున్నారు. ఇది అభినందించాల్సిన విషయమే. అయితే డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ప్రభుత్వ శాఖలో చేస్తూ అదే సమయంలోనే 'ఒకేషనల్ డెయిరీ' రెగ్యులర్ కోర్సు చేయడం ఎలా సాధ్యమైంది? డ్యూటీకి ఎలా వెళ్లారు..? రెండేళ్ల ఒకేషనల్ డెయిరీ కోర్సు చదివేందుకు కళాశాలకు ఎప్పుడు వెళ్లారు..? ఇవన్నీ అంతుచిక్కని ప్రశ్నలు. గురువారం విడుదలైన ఉద్యోగ నియామక ప్రతిభ పరీక్షలు ఫలితాల్లో ఇలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారని అర్హులైన నిరుద్యోగ యువత ఆందోళనచెందుతోంది. బోగస్ సర్టిఫికెట్లను పరిశీలనలోనే అడ్డుకట్ట వేస్తే కాలేజీలకు వెళ్లి కష్టపడి చదివిన నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. లేదంటే స.హ చట్టం ద్వారా వివరాలు సేకరించి న్యాయపోరాటం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.



పశు సంవర్ధక శాఖ కార్యాలయం

కర్నూలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 1,800 వెటర్నరీ అసిస్టెంట్స్ పోస్టుల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబరు 11 వరకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 252 పోస్టులకు గానూ 2,076 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,864 మంది పరీక్షలకు హాజరు అయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలు విడుదల చేసింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానంలో మెరిట్ ఆధారంగా భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నెగిటివ్ మార్కులు పోనూ ఓసీ, క్రీడాకారులు, మాజీ సైనిక ఉద్యోగులకు 40 శాతం, బీసీలు 30 శాతం, ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు (వికలాంగులు) 30 శాతం మార్కులు సాధించే ఉద్యోగ నియామకానికి అర్హత (క్వాలిఫైడ్)గా నిర్ణయించారు. ఆపైన మార్కులు సాధించిన వారిలో నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తారని పశు సంవర్ధక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా మెరిట్ అర్హత సాధించిన వారిలో బోగస్ విద్యార్హతతో పాటు స్పోర్ట్స్, ఇన్ సర్వీస్ కోటా కింద గ్రేస్ మార్కులతో మెరిట్ సాధించిన వారు కూడా ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కర్నూలు నగరం బిక్యాంప్, బిర్లా గేట్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఏజెంట్లను పెట్టుకొని నకిలీ సర్టిఫికెట్ల అమ్మకాలు చేపట్టినట్లు సమాచారం. అతడి నుంచి కొందరు సర్టిఫికెట్లను తయారు చేయించుకుని ఉద్యోగాలు పొందారని ఆరోపణలు వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బోగస్ సర్టిఫికెట్లపై క్షుణ్ణంగా పరిశీలన చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్ పశు సంవర్ధక శాఖ జేడీకి ఫిర్యాదు చేశారు.

బోగస్ అని తేలితే క్రిమినల్ కేసులు నమోదు



ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్స్ పోస్టులు 252 ఖాళీ ఉన్నాయి. వీటి భర్తి కోసం నోటిఫికేషన్ జారీ చేస్తే 2,076 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేయగా 1,864 మంది పరీక్షలకు హాజరయ్యారు. గురువారం ఫలితాలు వచ్చాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానంలో మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తాం. దరఖాస్తు నమోదు సమయంలో అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన విద్యార్హత, స్పోర్ట్స్, ఇన్ సర్వీస్ సర్టిఫికెట్లను పరిశీలిస్తాం. బోగస్ అని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– రామచంద్రయ్య, జేడీ, పశు సంవర్ధక శాఖ, కర్నూలు

బోగస్‌కు అడ్డుకట్ట వేయండి


ఫిర్యాదు చేస్తున్న నాగేశ్

సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్స్ పోస్టుల నియామకాల్లో బోగస్ సర్టిఫికెట్లు భారీగా ఉన్నాయి. వాటిపై పక్కాగా విచారించి కాలేజీలకు వెళ్లి చదువుకున్న నిరుద్యోగులకు న్యాయం చేయాలి. సమాచార హక్కు చట్టం ద్వారా న్యాయం పోరాటం చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం.

– నాగేశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి, కర్నూలు

వేమన సంఘ సంస్కర్త: కలెక్టర్


నివాళి అరిస్తున్న కలెక్టర్‌డాక్టర్ జి .సృజన

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 19: తెలుగు సమాజాన్ని చైతన్యపరిచిన యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అని కలెక్టర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. శుకవారం కలెక్టరేట్‌లో ని కాన్ఫరెన్స్ హాలులో యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తేలికైన పదాలతో రాసిన వేమన పద్యాలు అన్ని తరాల ప్రజలు స్వీకరించారని అన్నారు. వేమన ప్రజాకవి అని, పామరులు, పండితులను అలరించిన ఆయన కవిత్వం శాశ్వతంగా ఉంటుందని అన్నారు.

తల్లిని హత్య చేసిన కొడుకు

ఆస్తి తగాదాలే కారణం

తుగ్గలి, జనవరి 19: నవమాసాలు మోసి కన్న కొడుకే కాలయముడయ్యాడు. ఆస్తి కోసం జన్మనిచ్చిన తల్లిని హతమార్చిన సంఘటన శుక్రవారం కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాతనకొత్తూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పచ్చర్లపల్లి లక్ష్మీదేవి (44) కొడుకు లిఖిత్‌కుమార్‌రెడ్డి ఇంటి ముందర గుంటకకు ఉండే ఇనుపరాడ్డు (మేడితోక)తో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో గ్రామానికి చేరుకుని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి హనుమంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. లక్ష్మీదేవి భర్త కృష్ణారెడ్డి ఏడేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి లిఖిత్‌కుమార్‌రెడ్డితో పాటు ఒక కుమార్తె కూడా ఉంది. వీరికి దాదాపు 11 ఎకరాల పొలం ఉంది. అందులో ఐదున్నర ఎకరాలు కొడుకు పేరు మీద, మరో ఐదున్నర ఎకరా లక్ష్మీదేవి పేరున ఉంది. ఆ ఆస్తిని తనకు రాయించలేదని తల్లి లక్ష్మీదేవి తలపై రాడుతో కొట్టి హత్య చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై అత్యాచారం చేశాడని ఫిర్యాదు

ఆత్మకూరు రూరల్, జనవరి 19: ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామంలో 12 ఏళ్ల బాలికపై పెద్ద నాన్న అత్యాచారం చేశాడని తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నారాయణ రెడ్డి తెలిపారు.

రైలులో కర్ణాటక మద్యం రవాణా

ఆదోని, జనవరి 19 : రైలులో కర్ణాటక మద్యం రవాణ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రైల్వే ఎస్సై గోపాల్ తన సిబ్బందితో ఆదోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం తెల్లవారుజమున మూడు గంటల సమయంలో మద్యం పట్టుకున్నారు. ఆదోనికి చెందిన బోయ ఉదయ్ కుమార్‌తో పాటు ముగ్గురు 16 బాక్సుల కర్ణాటక మద్యాన్ని ఆరు లగేజ్ బ్యాగులలో వేసుకొని పీఎఫ్ నెం1లో దిగిపోతుండగా అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1536 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో రైల్వే ఎస్సైతోపాటు హెచ్‌సీ సాయి, పోలీసులు గాదిలింగ, హుస్సైని, పెద్దయ్య పాల్గొన్నారు.

ఆదోనిలో చైన్ స్నాచింగ్

ఆదోని, జనవరి 19 : ఆదోనిలో శుక్రవారం తెల్లవారుజామున చైన్ స్నాచింగ్ జరిగింది. తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఎస్కేడీ కాలనీలో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మి మహాయోగి లక్ష్మమ్మ దేవాలయానికి ఒంటరిగా దర్శనం కోసం వెళ్లింది. మార్గమధ్యంలో చిన్న మార్కెట్ సమీపంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు తన మెడలోని ఆరు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారని కన్నీరు పెట్టుకుంది. తెల్లవారుజామున ఎవరూ లేకపోవడంతో బైక్‌పై వచ్చిన దుండగులు చైన్‌ను లాక్కొని వెళ్లినట్లు ఆమె పేర్కొంది. ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

22న శ్రీరామచంద్రుని శోభా యాత్ర


మాట్లాడుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 19: అయోధ్య క్షేత్రంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని మంత్రాలయంలో శ్రీరామచంద్రుని శోభా యాత్ర చేపడుతున్నట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. శుక్రవారం గురురాజా సభా ప్రాంగణ భవనంలో అన్ని శాఖల ఉద్యోగులు, గ్రామస్తులతో కలిసి 22న చేపట్టే శోభా యాత్రకు సిద్ధం కావాలని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భారతీయ సంస్కృతి సంప్రాదాయ సనాతన భారతీయ పరిరక్షణ ధర్మజాగృతి కలిగించడానికి మంత్రాలయం పురవీధుల్లో ఊరేగింపునకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. శ్రీరామచంద్రుని శోభా యాత్రకు గ్రామంలో ప్రతి ఒక్కరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. శోభాయాత్ర అనంతరం శ్రీరాముని ఏకశిల విగ్రహాన్ని నిలుచోబెడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి, విజ్జుస్వామి, క్రిష్ణమూర్తి, దత్తు, జేపీ స్వామి, అనంతపురాణిక్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులు హక్కులను వినియోగించుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 19: అసంఘటిత కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు అవసరమైన సహాయం ఉచితంగా అందించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పని చేస్తున్నదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క కార్మికుడు ఈశ్రమ్, పీఎం-ఎస్‌వైఎం కార్డును చేయించుకుంటే ఎంతో లబ్ధి పొందవచ్చని, భవిష్యత్తులో కుటుంబానికి ఈకార్డు ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ మాట్లాడుతూ ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా అందిస్తున్న మెరుగైన ఉచిత న్యాయ సేవలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేబర్ డిపార్టుమెంటు అసిస్టెంట్ కమిషనర్ సాంబశివ మాట్లాడుతూ కార్మికులు ఈశ్రమ్ కార్డు ద్వారా ఎన్నో రకాలుగా లబ్ధి పొందవచ్చని అన్నారు. న్యాయవాది నిర్మలమ్మ మాట్లాడుతూ శనివారం మార్కెట్ యార్డులో ఈశ్రమ్- పీవై-ఎస్‌వైఎం క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారిపై అఘాయిత్యం జరిగితే ఇంత నిర్లక్ష్యమా?

- నిందితుడు వైసీపీ నాయకుడు కావడం వల్లే అరెస్టు చేయడం లేదు
- పోలీసు స్టేషన్ ఎదుట టీడీపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న టీడీపీ జిల్లా నాయకులు, ఇన్‌చార్జిలు

పత్తికొండ, జనవరి 19: దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో కొద్ది రోజుల క్రితం ఏడేళ్ల చిన్నారిపై గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అఘాయిత్యం చేశాడని ఆ కేసులో ఇప్పటికి వరకు నిందితుడిని ఎందుకు అరెస్టు చేయలేదంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, పార్లమెంట్ సమన్వయకర్త ప్రభాకర్ చౌదరి, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కేఈ ప్రభాకర్ అన్నారు. నిందితుడిని అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ పత్తికొండ పోలీస్‌స్టేషన్ ముందు కేఈ శ్యాంబాబు, బీవీ నాగేశ్వరరెడ్డి, మీనాక్షినాయుడు, సుజాతమ్మ, టీజీ భరత్, తిక్కారెడ్డిలతోపాటు దేవనకొండ, పత్తికొండ మండలాల టీడీపీ నాయకులు శుక్రవారం ధర్నాకు దిగారు. అత్యాచార సంఘటనపై పోలీసులు నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. నిందితుడు అధికార పార్టీకి చెందిన వాడు కావడంతో అరెస్టు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారని ఆరోపించారు. నిందితుడిని అరెస్టు చేసే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. దీంతో పోలీసులు ఇప్పటికే నిందితుడిపై కేసు నమోదు చేశామని, ఒకటి రెండు రోజుల్లో నిందితుడిని అరెస్టు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

మావోయిస్టు ఉద్యమంలో గడివేములవాసి మృతి

- ఎన్‌కౌంటర్‌లో గాయపడి చికిత్స పొందుతూ..
- ఆలస్యంగా వెలుగులోకి..


జయమ్మ (ఫైల్)

నంద్యాల క్రైం, జనవరి 19: కేరళలోని ఉరుప్పుంకుట్టి అటవీ ప్రాంతంలో తండర్‌బోల్టు కమాండర్లకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏపీ క్యాడర్‌కు చెందిన మావోయిస్టు నేత నామాల జయమ్మ అలియాస్ కవిత అలియాస్ జ్యోతి మృతిచెందినట్లు తెలిసింది. రెండు నెలల క్రితం జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో బుల్లెట్ గాయాలతో తప్పించుకున్న ఆమె చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కేరళ మావోయిస్టు పార్టీ ప్రకటించింది. నంద్యాల జిల్లా గడివేములకు చెందిన జయమ్మ గత ఏడాది నవంబర్ 13న కేరళలోని కన్నూర్ జిల్లా అయ్యన్‌కున్ను పంచాయతీలోని ఉరుప్పుం కుట్టి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో గాయపడింది. ఈ ఘటనలో మరో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందగా జయమ్మ గాయపడి తప్పించుకొని, మృతి చెందినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. ఆమె మృతదేహాన్ని అటవీ ప్రాంతంలోనే ఖననం చేసి వివరాలను మావోయిస్టు పార్టీ ప్రకటించింది.

వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి

గడివేములకు చెందిన నాగార్జున, సుబ్బమ్మల కుమార్తె జయమ్మకు పాతికేళ్ల క్రితం బండిఆత్మకూరు మండలం పరమటూరుకు చెందిన సమీప బంధువు నామాల భాస్కర్‌తో వివాహమైంది. రెండేళ్ల వైవాహిక జీవితం అనంతరం విభేదాలతో విడిపోయారు. 2002లో అప్పటి పీపుల్స్‌వార్ రాజకీయాలతో ఆకర్షితురాలై అజ్ఞాతంలోకి వెళ్లి మహానంది దళంలో పని చేసింది. ఈ క్రమంలో భార్యాభర్తలు విడిపోయాక 2005లో భాస్కర్ పోలీసులకు లొంగిపోయాడు. జనజీవన స్రవంతిలో చేరి ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఆ తర్వాత జయమ్మ మరో మావోయిస్టు జీవన్‌ను వివాహం చేసుకుంది. 2007లో నంద్యాల-గిద్దలూరు ఘాట్‌లో నెమళ్లజాడవద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో జీవన్ మృతిచెందగా అప్పటి మావోయిస్టుపార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు, జయమ్మతోసహా అయిదుగురు తప్పించుకున్నారు. ఆ ఎన్‌కౌంటర్‌తో నల్లమలలో బలహీనపడిన మావోయిస్టు పార్టీ కేడర్‌లోని కొంతమందిని కర్ణాటక ఏరియాకు బదిలీ చేసింది. అట్లా కర్ణాటకలో కొద్ది కాలం పని చేశాక కేళకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఈమెపై 20కి పైగా కేసులున్నాయి.

22 మంది పోలీసులకు స్థాన చలనం

కర్నూలు, జనవరి 19: రాయలసీమ రేంజ్ పరిధిలో 22 మంది పోలీసు అధికారులకు స్థానచలనం కల్పిస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ జి.కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ నియమావళి మేరకు బదిలీలు చేపట్టారు. ఇటీవలే కొద్ది మంది ఎస్ఐలకు, ఆర్‌పీఎస్ఐలకు కేటాయించిన స్థానాలను రద్దు చేసి కొత్త స్థానాలు కేటాయించారు.

పోలీసు పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.శోభారాణి (డబ్ల్యూఎస్ఐ)	వీఆర్	హెచ్‌ఆర్‌ఏ కార్యాలయం
పి.మహ్మద్ అలీఖాన్ (ఆర్‌పీఎస్ఐ)	కర్నూలు తాలుకా	వీఆర్
ఎస్.సోమ్లా నాయక్ (ఆర్‌పీఎస్ఐ)	కర్నూలు (నాగులాపురం)	వీఆర్
జి.మల్లికార్జున (ఆర్‌పీఎస్ఐ)	డీటీసీ, కర్నూలు	వీఆర్
ఎంసీ రంగయ్య (ఆర్‌పీఎస్ఐ)	డీటీసీ, కర్నూలు	వీఆర్
బి.ఫుల్లన్న నాయక్ (ఆర్‌పీఎస్ఐ)	పీసీఆర్	వీఆర్
పి.నిర్మలా దేవి (ఆర్‌పీఎస్ఐ)	పీసీఆర్	వీఆర్
డి.సీహెచ్ పుల్లయ్య (ఆర్‌పీఎస్ఐ)	పీసీఆర్	వీఆర్
బి.ఉమాపతి (ఆర్‌పీఎస్ఐ)	పీసీఆర్‌బీ	వీఆర్
సీహెచ్ వెంకట రమణ (ఆర్‌పీఎస్ఐ)	వీఆర్	రేంజ్ వీఆర్, కర్నూలు
బీవీ రమణ రావు (ఆర్‌పీఎస్ఐ)	కర్నూలు త్రీటౌన్	రేంజ్ వీఆర్, కర్నూలు
వై.సుబ్బరాయుడు (ఆర్‌పీఎస్ఐ)	వీఆర్	రేంజ్ వీఆర్
ఆశా బేగం (డబ్ల్యూఎస్ఐ)	నంద్యాల, వీఆర్	వీఆర్ అనంతపురం
ఆర్.శ్రీనివాసులు (ఆర్‌పీఎస్ఐ)	డీసీఆర్‌బీ, కర్నూలు	రేంజ్ వీఆర్
ఎస్ఏ రవూఫ్ (ఆర్‌పీఎస్ఐ)	కర్నూలు త్రీటౌన్	రేంజ్ వీఆర్
ఎస్.జాకీర్ హుశేన్	పీసీఆర్	సీసీఎస్ అన్నమయ్య
ఎస్ఎండీ జాఫర్ హుశేన్	కర్నూలు వన్‌టౌన్	పీసీఆర్, కర్నూలు
ఎ.అంజాద్ వలి (ఆర్‌పీఎస్ఐ)	అటాచ్డ్ అనంతపురం	వీఆర్, కర్నూలు
కేసీ తిరుపాల్ (ఆర్‌పీఎస్ఐ)	అటాచ్డ్ అనంతపురం	వీఆర్, కర్నూలు
ఎం.వెంకట చలపతి (ఆర్‌పీఎస్ఐ)	అటాచ్డ్ అనంతపురం	డీటీసీ అనంతపురం
ఎ.రామకృష్ణయ్య (ఎస్ఐ)	అటాచ్డ్ అనంతపురం	వీఆర్, కర్నూలు
కె.రాజా కుళ్లాయప్ప (ఎస్ఐ)	అటాచ్డ్, చిత్తూరు	వీఆర్, కర్నూలు

దళితుల ద్రోహి జగన్

- పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత


అంబేడ్కర్ చిత్రపటాన్ని పాలతో శుద్ధి చేస్తున్న గౌరు దంపతులు, మల్లెల

కల్లూరు, జనవరి 19: రాష్ట్రంలో దళిత ఉద్యోగులను పొట్టనపెట్టుకున్న ద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వ్యక్తి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సిగ్గుచేటన్నారు. శుక్రవారం నగరంలోని గౌరు నివాసంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని పాలతో శుద్ధిచేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక డాక్టర్ సుధాకర్, డాక్టర్ అచ్చెన్న వంటి ఉద్యోగులను పొట్టన పెట్టుకుందని విమర్శించారు. వైసీపీ పాలనలో వందల సంఖ్యలో దళితులు చిత్రహింసలకు గురయ్యారన్నారు. ఎన్నికల వేళ మళ్లీ దళితులను మోసం చేసేందుకు సీఎం జగన్ సిద్ధమయ్యాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, శివన్న, రజాక్‌భాషా, మధు, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు వ్యవసాయ విద్యుత్ కోత

కల్లూరు, జనవరి 19: జిల్లా కేంద్రంలోని 220 కెవి ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలోని సబ్‌స్టేషన్‌లో ఏపీ ట్రాన్స్‌కో 132 కేవీ ఆధునికీకరణ పనుల నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కోత ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ.యం. ఉమాపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మూడో శనివారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయానికి అందించే త్రీఫేస్ కరెంట్‌లో అంతరాయం ఉంటుందన్నారు. అందులో భాగంగా కర్నూలు రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని గూడూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ, ఆలూరు సబ్ డివిజన్‌లోని అన్ని 33/11 కెవి సబ్‌స్టేషన్లలో కరెంట్ ఉండదన్నారు.

- నగరంలో విద్యుత్‌కోత: నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్‌కోత ఉంటుందని కర్నూలు డివిజన్ ఆపరేషన్ ఈఈ చక్రపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. నగరంలోని సెంట్రల్ సెక్షన్, బళ్ళారి రోడ్ సెక్షన్, సంతోష్‌నగర్ సెక్షన్, పవర్‌హౌస్ సెక్షన్, సి.క్యాంప్ సెక్షన్, ఓల్డ్‌టౌన్ సెక్షన్, కల్లూరు ఎస్టేట్ సెక్షన్‌లోని ఆయా ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందన్నారు. విద్యుత్ మరమ్మతు పనులు లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా ఉంటుందని అధికారులు తెలిపారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

24న మండల కార్యాలయాల ఎదుట ధర్నా



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: జిల్లాలో వలసలు అరికట్టాలని, ఉపాధి బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈనెల 24 అన్ని మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కేకే భవన్‌లో రైతు సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం బి.వీరశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ జిల్లాలో తీవ్రమైన కరువుతో గ్రామీణ పేదలు, సన్న చిన్నకారు రైతులు సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. పేరుకు మాత్రమే 22 మండలాలు కరువు మండలాలుగా గుర్తించామని నెల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ, ఉపాధ్యక్షుడు కే.లింగన్న, ఈ.తిక్కన్న. బి.నాగన్న. వెంకటరాముడు, బి.బాలక్రిష్ణ పాల్గొన్నారు.

దోమల బెడద నుంచి కాపాడండి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: నగరంలోని పాతబస్తీలో దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నగర అధ్యక్షుడు అష్వాక్ హుస్సేన్ కోరారు. శుక్రవారం నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అష్వాక్ హుస్సేన్ మాట్లాడుతూ తుంగభద్ర నదిని ఆనుకుని ఉన్న మొదటి పది వార్డులతోపాటు 14వ వార్డులో కూడా దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, ఇంతియాజ్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

34వ రోజూ క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె

కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 34వ రోజుకి చేరింది. కార్పొరేషన్ ఎదుట క్లాప్ ఆటో డ్రైవర్లు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. సమ్మెనుద్దేశించి సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ మాట్లాడుతూ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రఘుశేఖర్, నరేష్, నవీన్, పరమేష్ పాల్గొన్నారు.

కులగణనకు సిబ్బంది నియామకం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో కులగణన చేసేందుకు అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్ సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే కులగణనకు 11 మంది సూపర్‌వైజర్లతోపాటు వారికి సహకరించేందుకు 22 మంది జూనియర్, రికార్డు, సీనియర్ అసిస్టెంట్లను నియమించారు. సచివాలయ సిబ్బంది, వలంటీరు సహకారంతో ప్రతి ఇంటికి వెళ్లి కులగణన చేసి అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ ఆదేశించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా సాయిప్రదీప్

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 19: భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా, జిల్లా హెడ్ క్వార్టర్స్ ఇన్‌చార్జిగా పీటీ సాయిప్రదీప్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ నియమిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రోజుల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పీటీ సాయిప్రదీప్ తెలిపారు. తనను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించడంపై రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేపు రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 19: స్థానిక రిడ్జ్ పాఠశాలలో ఈ నెల 21న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఈవో గోపినాథ్ తెలిపారు. శుక్రవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ రిడ్జ్ పాఠశాల యజమాన్యం భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంటు డైరెక్టర్ రవినాయక్, కన్వీనర్స్ శ్రీనివా సులు, నాగేంద్ర, కోచ్ ఇమామ్ హుశేన్ పాల్గొన్నారు.

బాలాజీ హాస్పిటల్‌లో కిడ్నీ మార్పిడికి అనుమతి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 19: స్థానిక ఎన్‌ఆర్‌పేటలో ఉన్న బాలాజీ హాస్పిటల్‌కు రాష్ట్ర ప్రభుత్వం కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేందుకు అనుమతి లభించినట్లు సీనియర్ యురాలజిస్టు మొట్టమొదటి కిడ్నీ ఆపరేషన్ చేసిన డా.ఏవీఎస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన హాస్పిటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కిడ్నీ సమస్యలు అధికమయ్యాయని, చాలా మంది డయాలసిస్ చేయించుకొంటున్నారని తెలిపారు. ఇందులో కొద్ది మందికి తప్పనిసరి పరిస్థితుల్లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయాల్సి వస్తుంద న్నారు. కిడ్నీ బాధితుడికి రక్త సంబంధికులైన భార్యపిల్లలు, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఇచ్చిన కిడ్నీని కిడ్నీ మార్పిడీ ఆపరేషన్ చేస్తామన్నారు. ఈసమావేశంలో మేనేజర్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపకులపతిని కలిసిన నాన్ టీచింగ్ ఉద్యోగులు

కర్నూలు(అర్బన్), జనవరి 19: రాయలసీమ యూనివర్సిటీ నూతన ఉప కులపతిగా బెల్లం సుధీర్ ప్రేమ్‌కుమార్‌ను నాన్ టీచింగ్ ఉద్యోగులు కలిశారు. శుక్రవారం ఆయనను చాంబర్లో నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి వి.రమేష్, కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.కృష్ణవేణి, జాయింట్ సెక్రటరీ కిరణ్మయి, ఉపాధ్యక్షులు అబ్దుల్ రహిమాన్, రాయకృష్ణ, లోకేష్ ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు కలెక్టరేట్ జనవరి 19: తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామంలో జగనన్న కాలనీ పేరుతో రూ.18 లక్షలు నిధులు స్వాహా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ శుక్రవారం కలెక్టర్ సృజనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జగనన్న కాలనీ పేరుతో అధికారులు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా రూ.18 లక్షలు నిధులు డ్రా చేశారు అని ఆరోపించారు. రంగస్వామి, ఆచారి, శ్రీరాములు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 19: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి తెలిపారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను డీఈవో రంగారెడ్డి, ఏడీ శామ్యూల్ పాల్, ఆర్‌యూపీపీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్ కుమార్, జీ.నాగేంద్రుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌యుపీపీ నాయకులు వెంకట్రాముడు, సురేంద్ర, రవి, బాలచంద్రుడు, రామన్న, హుశేన్, అంజిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

కర్నూలు, జనవరి 19: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలాజీ నగర్‌లో నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నీలిశికారి సరోజ మరో వ్యక్తిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లింగ నిర్ధారణ నేరం

» కర్నూలు ఆర్‌డీవో అధ్యక్షతన కమిటీ సమావేశం

కర్నూలు(హాస్పిటల్), జనవరి 19: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని కర్నూలు ఆర్డీవో హరిప్రసాద్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వి.ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటి సమావేశం కర్నూలు ఆర్డీవో హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఉండే స్కానింగ్ కేంద్రాలు, కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. డివిజన్‌లో ఉన్న అల్ట్రాసౌండ్ కేంద్రాలను సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులచే తనిఖీలు నిర్వహించారని, జూనియర్ కళాశాలలు, పాఠశా లల్లో ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని కమిటీ తీర్మానం చేసింది. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వై.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్ నిర్వహించే అల్ట్రాసౌండ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఇంతియాజ్‌బాషా, కర్నూలు జీజీహెచ్ గైనిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.నర్మదా, డెమో ప్రమీలాదేవి, ఏపీపీలు సుబ్బయ్య శ్రీనివాసులు, ఎన్‌జీవో రాయపాటి శ్రీనివాసులు, మద్దిలేటి, పీసీపీఎన్‌డీటీ కన్సల్టెంటు సుమలత పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

22న 'అయోధ్య రామాలయం' వేడుకలు

కర్నూలు(కల్చరల్), జనవరి 19: అయోధ్యలోని రామాలయంలో ఈనెల 22న బాలరాముని విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా కర్నూలు నగరంలో అదేరోజూ అయోధ్య రామాలయం వేడుకలను ఏర్పాటు చేసినట్లు స్రీతారాముల కల్యాణోత్సవ సమితి అధ్యక్షుడు కె.క్రిష్టన్న తెలిపారు. శుక్రవారం నగరంలో సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిరం నిర్మాణం ఐదు వందల ఏళ్ల నాటి హిందువుల కల అని అన్నారు. ఈనెల 22న ఉదయం 10 గంటలకు పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు జమ్మిచెట్టు నుంచి శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ శోభాయాత్రలో చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, జానపద కళారూపాల ప్రదర్శనలు, మహిళల కోలాటాలు, 108 కలశ బిందెలతో ఈ శోభాయాత్ర ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకుంటుందని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్ర మాలు, 6.30 గంటలకు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామిచే ధార్మిక ప్రవచన బోధనలు, టీడీడీ పురాణ పండితుడు వి రామకృష్ణ శేషసాయిచే ఆధ్యాత్మిక బోధనలు ఉంటాయని తెలిపారు. రాత్రి 7.30 గంటలకు శ్రీరాముని పట్టాభిషేకం డాక్టర్ మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి బృందంచే శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈసమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కగ్గోలు హరీష్‌బాబు, సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షులు ఎస్వీ నారాయణరెడ్డి, మహోబలేష్, ప్రధాన కార్యదర్శి నాగోజీరావు, కార్యదర్శి నటేష్‌కుమార్, కోశాధికారి కల్కి మురళి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న కార్తీక దీపోత్సవ కమిటీ మహిళా ప్రతినిధులు

శ్రీరామ పట్టాభిషేకానికి ఆహ్వానం: ఈనెల 22న కర్నూలు నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే శ్రీరామ పట్టాభిషేకానికి రావాల్సిందిగా కలెక్టర్ సృజనకు సమితి ప్రతినిధులు ఆహ్వానపత్రం అందజేశారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సృజనను కర్నూలు కార్తీక దీపోత్సవ కమిటీ మహిళా ప్రతినిధులు ఇ. పద్మావతి, అనురాధ, కృష్ణవేణి, దీప, స్వప్నసారధిలు ఆహ్వాన పత్రం అందజేశారు.

దళితుల ద్రోహి జగన్



అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దళితులు

ఓర్వకల్లు, జనవరి 19: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళితుల ద్రోహి అని మాజీ ఎంపీటీసీ నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం దళితులను మోసగించడమేనని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, సుధాకర్, రామగోవిందు, శేఖర్, బజారు, వేణు, కాటినేని నారాయణ, జయక్రిష్ణ, దళితులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 19: భారత వాయుసేనలో అగ్నివీర్-వాయు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని సెట్కూరు సీఈవో పీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, డిప్లమా పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుంచి ఈ నెల 17 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు Https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామ న్నారు. విద్యార్హత సైన్స్ విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఎంపీసీ 50 శాతం మార్కులతో లేదా మెకానికల్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, కంప్యూటర్ సైన్స్, ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెసి లిజషన్‌తో 50 శాతం మార్కులతో 3 సంవత్సరాల డిప్లమా కోర్సు చేసి ఉండా లన్నారు. అలాగే సైన్స్ కాకుండా ఇతర విభాగాల ఉద్యోగాలకు 50 శాతం మా ర్కులతో ఇంటర్మీడియట్ లేదా సీబీఎస్ఈ ద్వారా గుర్తింపు పొందిన శిక్షణా సంస్థలలో 50శాతం మార్కులతో రెండేళ్ల ఒకేషనల్ కోర్సు అయి ఉండాల న్నారు. వయస్సు 17 సంవత్సరాల 6 నెలల నుంచి 21 సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 17 తర్వాత ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష నిర్వహిస్తామని, తదుపరి విద్యార్హత ధృవపత్రాల పరిశీలన పూర్తయిన యెడల శారీరకధారుడ్య పరీక్షలలో భాగంగా 1.6 కి ప రుగు పందెం పురుష అభ్యర్థులు 7 నిమిషాలలో, మహిళా అభ్యర్థులు 8 నిమిషాలలో, పుషప్స్ మొదలగునవి పూర్తి చేయాలన్నారు.

ఉద్యోగాలకు 53 మంది ఎంపిక

కర్నూలు(అర్బన్), జనవరి 19: ఉద్యోగాలకు 53 మంది ఎంపికైనట్లు ఉపాధి కల్పనా అధికారి పి.దీప్తి తెలిపారు. శుక్రవారం నగరంలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో అమర్‌రాజా, గ్రీన్ టెక్ ఇండస్ట్రీ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి.

సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కే జగన్నాథం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 19: ఈ నెల 30న జరగనున్న ఇందిరమ్మ, టిడ్కో గృహ లబ్ధిదారుల సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం పిలుపునిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో సీపీఐ నగర కౌన్సిల్ సమావేశం నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి 14 సంవత్సరాలు గడుస్తున్నా కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో అధికా రులు విఫలమయ్యారని విమర్శించారు. అలాగే టిడ్కో గృహాల పేరుతో పేదల ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి కట్టించినటువంటి 10,400 ఇళ్ల నేటికి పదేళ్లల కావస్తున్న పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్, జనవరి 19: ప్రజలకు బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమావేశ భవనంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ శేషఫణి మాట్లాడుతూ మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, బాతురూమ్‌లు, కరెంటు ఉండేటా చూడాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. అలాగే రీసర్వే పూర్తయిన గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈసమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు, జనవరి 19: ఓర్వకల్లు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివనాగప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరుగుతుందని, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాటసాని హాజరవుతారని తెలిపారు. గతంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై సమీక్ష ఉంటుందన్నారు. ఈసమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖాల అధికారులు హాజరు కావాలన్నారు.

జేవీవీ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(అర్బన్), జనవరి 19: నగరంలో ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ద్వితీయ మహాసభ శుక్రవారం జరిగింది. ఈకార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం రామక్రిష్ణారెడ్డి, ఐక్యవేదిక భాగస్వామ్య సంస్థ వ్యవస్థాపకుడే డాక్టర్ బ్రహ్మారెడ్డి హాజరయ్యారు. చంద్రన్న అధ్యక్షతన నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దేశాయ్, కోశాధికారిగా గద్వాల ఈరన్న, ఉపాధ్యక్షుడిగా శేషగిరి, కార్యదర్శిగా రవీ, మరి కొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు.

25న టెంకాయల వేలం

కోడుమూరు(రూరల్), జనవరి 19: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి ఆలయంలో ఈనెల 25న టెంకాయల వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో గుర్రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో మూడుసార్లు వాయిదా పడిన వేలం తిరిగి నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే 29న మాధవ స్వామి, వీరభద్రస్వామి ఆలయ భూములకు కౌలు బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు.

ఆటోలో చోరీ

కర్నూలు, జనవరి 19: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకటరమణ కాలనీలో ఆటోలో వెళ్తున్న వెంకట శేషారెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.10వేలు చోరీ చేశారు. అబ్బాస్‌నగర్‌కు చెందిన వెంకట శేషారెడ్డి వెంకటరమణ కాలనీకి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆటోలో గుర్తు తెలియని వ్యక్తి ఈ చోరీ చేశాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన పకడ్బందీగా నిర్వహించాలి

కోడుమూరు(రూరల్), జనవరి 19: కులగణనను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ జయన్న, ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని వర్కూరులో నిర్వహిస్తున్న గణనను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెండు విభాగాలలో కనిపించే వివరాలను నమోదు చేయాలన్నారు. కుటుంబ యజమాని, సభ్యుల వివరాలు, యజమాని బంధుత్వం, నివాస రకం, తాగునీటి సదుపాయం, పశుసంపద తదితర వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. అలాగే ఆరోగ్య వైద్య సేవలను తహసీ ల్దార్, ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు జయరాముడు, మహేష్ పంచాయితీ కార్యదర్శులు సంజీవరావు, మహేష్ పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని కంబందహాల్, బురాన్‌దొడ్డి, పలుకుదొడ్డి, గొల్లల దొడ్డి, చింతమానుపల్లె గ్రామాలలో కులగణన ప్రారంభించినట్లు మండల ఈవోఆర్డీ సందీప్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవోఆర్డీ సందీప్ మాట్లాడుతూ గ్రామ పం చాయతీలలో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించాలన్నారు.



వర్కూరులో కులగణన తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

విద్యుత్ స్తంభాల ఏర్పాటును విరమించుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం జిల్లా నాయకులు

కల్లూరు, జనవరి 19: గ్రీన్‌కో కంపెనీ పంట పొలాల్లో కరెంట్ స్తంభాల ఏర్పాటును విరమించుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు మండలం ఎర్రకత్వ గ్రామంలో రైతులు ఎర్రమల కృష్ణ, బాలునాయక్, గోపినాయక్, ధన్‌రాజ్ నాయక్‌ల పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా పచ్చని పొలాల్లో తక్కువ నష్టపరిహారం ఇచ్చి కరెంట్ స్థంభాలు వేయడం సరైందికాదన్నారు. సమాచార హక్కుచట్టం నాయకులు జయన్న, ఎంఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఏపీసీని కలిసిన ఆపస్ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 19: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ విజయ జ్యోతి కుమారిని ఆపస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన అసంపూర్తి పనులను సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎస్ఏ ఏపీసీని కలిసిన వారిలో ఆపస్ నాయకులు కర్నూలు జిల్లా అధ్యక్షుడు నాగస్వామి నాయక్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రఘునాథరెడ్డి, స్వామి నాయక్, శేషాద్రి శర్మ ఉన్నారు.

వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడికి ఆహ్వానం

కర్నూలు(కల్చరల్) జనవరి 19: అయోధ్యలో ఈనెల 22న జరుగనున్న శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉత్సవానికి విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డికి ఆహ్వానం అందింది. శుక్రవారం ఆయన కర్నూలు రైల్వే స్టేషన్ నుంచి అయోధ్యకు బయల్దేరి వెళ్లారు. నందిరెడ్డి కుటుంబ సభ్యులు, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు టి. ప్రతాపరెడ్డి, ఈపూరి నాగరాజు, తెలుగు భగీరథ, ముత్యాల ఈశ్వర్, హరి, జయప్రకాశ్ సింగ్‌లు ఆయనకు వీడ్కోలు పలికారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, జనవరి 19: మండలంలోని తిమ్మన్నదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలు నది పక్కన ఉండటంతో నదిలో నీరు లేకపోవడంతో ఆయా గ్రామాలలో ఉన్న చేతి పంపులను మరమ్మతులు చేయాలన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

కోడుమూరు (రూరల్), జనవరి 19: గ్రామాలలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ విజయశేఖర్ హెచ్చరించారు. మండలంలోని అమడగుంట్లలో శుక్రవారం రాత్రి పోలీసులు గ్రామసభ నిర్వహించారు. అంతకుముందు డీఎస్పీ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహం పెడితే పాపాలు పోతాయా?

టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్



మాట్లాడుతున్న ఆకెపోగు ప్రభాకర్

గూడూరు, జనవరి 19: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం పెడితే దళితులపై ఆయన చేసిన పాపాలు పోతాయా అని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ ప్రశ్నించారు. శుక్రవారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ ఏపీలో దళితులపై దాడులు చేయిస్తూ విగ్రహం పెడితే దళితులు బాగు పడినట్లా, వారిపై నీకు ప్రేమ ఉన్నట్లా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మన్నన్‌బాషా, సుమన్ బాబు పాల్గొన్నారు.

యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలి



యోగి వేమన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు(కల్చరల్) జనవరి 19: యోగి వేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్య క్షుడు పల్లె శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం యోగి వేమన జయంతి సందర్భంగా నగరంలోని వారధి కార్యాలయంలో, సంఘం ప్రతినిధులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గత కొన్ని సంవత్సరాలుగా విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బీరు ప్రతాపరెడ్డి, టి. ప్రతాపరెడ్డి, గీతామాధురి, రజనీకాంత్‌రెడ్డి, రేవతిరెడ్డి, రాధారెడ్డి, రాజారెడ్డి, రమేష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేయండి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 19: తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రచురణ పూర్తి అయిన తరువాత అన్ని పోలింగ్ స్టేషన్‌ల్లో కూడా వాటిని ఏర్పాటు చేసేలా ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ లు, బీఎల్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పోలింగ్ సిబ్బంది వివరాలను 10 రోజుల్లో సంబంధిత డీడీఓలు వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. జనవరి 25న నిర్వహించనున్న 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ షూర్ అనే థీమ్‌తో జిల్లా స్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, సుబ్రహ్మణ్యం, రామచంద్రరావు, మురళి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 19: ఉద్యోగ ఉపాధ్యాయులకు రూ.18 వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలంటూ యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ అధ్యక్షుడు ఎల్లప్ప అన్నారు. శుక్రవారం ఎమ్మిగ నూరులోని సోమప్ప సర్కిల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని ప్ర భుత్వ ఆసుపత్రి, ట్యాంకు బండు రోడ్డు, శకుంతల సర్కిల్, ఆర్టీసీ బస్టాం డ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సి ల్ సభ్యులు ఎల్లప్ప మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం ఉపా ధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ, ఆరియర్స్, పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు సరెండర్ సెలవులు సకాలంలో చెల్లించకుండా ఉపాధ్యాయులకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించేలా ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ, వరలక్ష్మీ, వెంకటేష్, వీరభద్రయ్య, భీమేష్, బాలరాజు, శ్రీనువాసులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపుల్లో జాప్యం తగదు

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 19: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం జాప్యం చేస్తోందని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు జీవిత, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపుపై నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న ఏపీజీఎల్ఐ లోన్‌లు, డీఏ, పీఆర్సీ అరియర్స్ సకాలంలో చెల్లించకపోతే ఉద్యోగ ఉపా ధ్యాయుల కుటుంబాలు చాలా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, కృష్ణమూర్తి, రుద్రముని, బసప్ప, నరసయ్య గౌడ్, కృష్ణుడు, ఆవుల బసప్ప, నాగేష్, రంగ స్వామి, నరసయ్య, రామన్న, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం పెడితే పాపాలు పోతాయా?



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్

ఆస్పరి, జనవరి 19: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయ వాడలో అంబేడ్కర్ విగ్రహం పెడితే దళితులపై ఆయన చేసిన పాపాలు పోతాయా అని ఆస్పరి మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, టీడీపీ తెలుగు యువత నాయకుడు సతీష్ కుమార్ తిమ్మన్న ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక గాంధీ పార్క్ ఆవరణలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లు ఎత్తేసి, సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించాడే తప్ప, అణగారిన వర్గాలకు ముఖ్యమంత్రి చేసిందేమి లేదని ధ్వజమెత్తారు. ఈసమావేశంలో సీనియర్ నాయకులు రామచంద్ర రెడ్డి, రామలింగప్ప, ఆంజనేయ, బిణిగేరి నారాయణ, వెంక టేష్, వీరేష్, మారేష్ పాల్గొన్నారు.

యాదవులకు రాజకీయ అవకాశం కల్పించాలి

ఆలూరు రూరల్, జనవరి 19: యాదవులకు రాజకీయ అవకాశాన్ని ఆయా పార్టీలు కల్పించాలని యాదవ చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరాముడు యాదవ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆలూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో యాదవులకు ఒక ఎంపీ, రెండు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి మల్లికార్జున యాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

షర్మిల చేరికతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ఆలూరు, జనవరి 19: వైఎస్ షర్మిల చేరికతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనా రాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా వైయస్ షర్మిలను నియమించడం, ఏఐసీసీ కార్యవర్గ సభ్యుడిగా గిడుగు రుద్రరాజును ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆలూరు, చిప్పగిరి మం డలాల అధ్యక్షులు లక్ష్మణ్ణ, మంజునాథ్, ఎస్సీ సెల్ తాలుకా అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు

ఆదోని టౌన్, జనవరి 19: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు జిందె సాయికుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక శక్తిగుడి ప్రాంతంలో పార్టీ మా జీ కౌన్సిలర్ మహేశ్వరి అధ్యక్షతన జరిగిన భారత్ సం కల్ప యాత్ర కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ అసి స్టెంట్ కమిషనర్ అనూరాద, ఇంజనీర్ రాధాకృష్ణ, బీజేపీ నాయకులు రమేష్ ఆచారి, లక్ష్మీకాంత్, రత్నభాయి, అంజయ్ కుమార్, మణికంఠ, శ్రీకాంత్, రాహుల్ చౌహాన్ పాల్గొన్నారు.

కులగణన ప్రారంభం

ఆదోని టౌన్, జనవరి 19: పట్టణంలోని అన్ని వార్డులలో సచివాలయ సిబ్బంది శుక్రవారం నుంచి కులగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుల ప్రాతిపదికన సామాజిక, ఆర్థిక అంశాల వివరాలను సచివాలయ సిబ్బంది సేకరిస్తున్నారు. ఈనెల 28వ తేదీ వరకు ఆయా వార్డులలో ఉన్న ప్రజలకు సంబంధించిన కులగణన కార్యక్రమం పూర్తి చేయాల్సి ఉందని 26వ వార్డు సచివాలయ అడ్మిన్ మహేష్ యాదవ్ తెలిపారు. సర్వే సమయంలో అందుబాటులో లేనివారు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వారి సచివాలయ కార్యాలయంలో హాజరై వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

శ్మశాన స్థలానికి హద్దులు చూపించండి

ఆదోని రూరల్ డిసెంబరు 19: ఆదోని మండలం సంతేకూడ్లూరు గ్రామంలో దళితుల శ్మశాన వాటిక స్థలానికి హద్దులు చూపించాలని కేవీపీఎస్ నాయకుడు తిక్కప్ప కోరారు. శుక్రవారం గ్రామ దళితులతో కలిసి ఆయన శ్మశాన వాటికను పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో ఉన్న దళితులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరామని, అయితే స్థలాన్ని చూపించారు గాని హద్దులు చూపించకపో వడంతో గ్రామంలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఈరన్న, మధు, శివయ్య, మద్దయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం వేయడం లేదని ఫిర్యాదు

ఆలూరు, జనవరి 19: ఆలూరు మండలం అగ్రహారం గ్రామంలో రేషన్ బియ్యం వేయడం లేదని గ్రామస్థులు శుక్రవారం తహసీల్దార్ రామాంజనేయులకు ఫిర్యాదు చేశారు. 19వ తేదీ గడిచినా రేషన్ బియ్యం వేయడం లేదని, సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు, షాకీర్, ఈరన్న కోరారు.

నిందితుడి అరెస్టు

దేవనకొండ, జనవరి 19: మండలంలోని ఓ గ్రామంలో ఏడేళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు కేదారిగాళ్ళ మునిరం గడును శుక్రవారం దేవనకొండ క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు పత్తికొండ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి, ఎస్సై భూపాలుడు తెలిపారు. నిందితు డిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

పల్లె ఖాళీ..

- వందలాది కుటుంబాలు గుంటూరు, బెంగళూరుకు వలస



గణేకల్లు నుంచి వలస వెళ్తున్న గ్రామస్థులు

మంత్రాలయం, జనవరి 19: మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం మండలాల నుంచి వందలాది కుటుంబాలు శుక్రవారం వలస వెళ్లారు. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే పిల్లాపా పలతో పెట్టెబేడ సర్దుకుని తెలంగాణ, గుంటూరు, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వలసలు వెళ్తుండడంతో ఊళ్లన్నీ ఖాళీ అవుతున్నాయి.

హొళగుంద: ఆదోని డివిజన్‌లో వలసలు ఆగడం లేదు. వందలాది కుటుంబాలు వలసలు వెళ్తున్నారు. మండలంలోని చిన్నహ్యాట గ్రామానికి చెందిన 200 మంది కూలీలు శుక్రవారం గుంటూరుకు వలస వెళ్లారు. ఈ విషయంపై ఎన్ఆర్‌జీఈఎస్ ఏపీవో భక్తవత్సలను వివరణ కోరగా ఉపాధి పనులు పూర్తయిన వారే వలస వెళ్తున్నారని చెప్పారు.

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని గణేకల్లు, పాండవగల్లు, విరుపాపురం, సాదాపురం తదితర గ్రామాల నుంచి ప్రజలు తమ పిల్లపాపలతో శుక్రవారం గుంటూరు, బెంగళూరు తదితర పాంత్రాలకు వలస వెళ్లారు.

గోనెగండ్ల: సొంతూరిలో కూలీ పనులు లేక పోవడంతో గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాల కూలీలు గత నెల రోజులుగా వలసబాట పట్టారు. అయితే వలస వెళ్లిన చోట కూడా కూలీజనం ఎక్కువగా ఉండటంతో పనులు లేక తిరిగి స్వగ్రామాలకు వస్తున్నారు. తెలంగా ణలోని సంగారెడ్డి జిల్లాకు పత్తి, వేరుశనగ పనుల కోసం గత 25 రోజుల క్రితం వెళ్లిన గంజహళ్లి, సంతనాగలాపురం, బైలుప్పల, అగ్రహారం గ్రామా లకు చెందిన 200 మంది కూలీలు అక్కడ పనులు లేక పోవడంతో పిల్ల పాపలతో శుక్రవారం నాలుగు వాహనాలలో సొంతూళ్లకు చేరుకున్నారు.



మంత్రాలయం మండలం మాధవరంలో..

వైసీపీ నుంచి టీడీపీలోకి 20 కుటుంబాలు

తుగ్గలి/పత్తికొండ, జనవరి 19: వైసీపీ విధివిధానాలు నచ్చక 20 కుటుంబాలు పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు సమ క్షంలో టీడీపీలోకి చేరారు. శుక్రవారం మండలంలోని రాంపల్లికి చెందిన వైసీపీకి చెందిన 20 కుటుంబాలు మాజీ జడ్పీ ఛైర్మన్ బత్తిన వెంకటరా ముడు, తుగ్గలి మండల కన్వీనర్ తిరుపాలునాయుడు ఆధ్వర్యంలో మద్ది కెర సూరన్న, ఆవుల పెద్దయ్య, లింగన్న, మల్లికార్జున, ఓబులేసులతో పాటు దాదాపు 50మందికి పైగా పత్తికొండ టీడీపీ కార్యాలయంలో శ్యాంబాబు అందరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాంపల్లి శీను, సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: మండలంలోని ఆగవేలి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు సమక్షంలో శుక్ర వారం చేరారు. ఉప సర్పంచ్ బోయ రామదాసు గారి రాముడు,బోయ ఆంజనేయులుతో పాటు మరో 20 కుటుంబాలు పార్టీలో చేరారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి ఆలంకొండ నబి సాహెబ్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా కేఈ శ్యాంబాబు మాట్లా డుతూ వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక వైసీపీ నాయకులు టీడీపీలోలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాదాపురం ఎల్వీ ప్రసాద్,మండల టీడీపీ అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు, టీడీపీ ప్రధాన కార్యదర్శి మాదాపురం గురుస్వామి,మండల తెలు గు యువత అధ్యక్షుడు బోయ బొంతిరాళ్ళ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో పార్టీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు

ఘనంగా పక్కీరయ్య స్వామి ఉరుసు

మాజీ ఎమ్మెల్యే బీవీ ప్రత్యేక పూజలు



ఫాతేహాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల, జనవరి 19: మండలంలోని నెరుడుప్పల గ్రామంలో శుక్రవారం పక్కీరయ్య స్వామి ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు ఫాతేహాలు సమర్పించారు. చుట్టుప క్కల గ్రామాల నుంచే గాక జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. శనివారం జియారత్ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు పెద్దలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనా గేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు స్వామికి ఫాతేహాలు సమర్పించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేదల కోసం ఉచిత అంబులెన్సులు: తిక్కారెడ్డి



ఉచిత అంబులెన్సులను ప్రారంభిస్తున్న తిక్కారెడ్డి, శ్రీనివాసరెడ్డి

మంత్రాలయం/ఎమ్మిగనూరు టౌన్, జనవరి 19: మంత్రాలయం నియోజకవర్గంలో ఎమ్మిగనూరుకు వచ్చి వైద్యం పొందే నిరుపేదల కోసం మూడు ఉచిత అంబులెన్సు వాహనాలు ఏర్పాటు చేసినట్లు టీడీపీ నియో జకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మిగనూరులో తన నివాసం దగ్గర తిక్కారెడ్డి సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన మూడు అంబులెన్సులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కౌతాళం, పెద్దకడుబూరు, కోసిగి, మంత్రాలయం మండలాల్లో మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరుకు వచ్చి చికిత్స పొందే నిరుపేదలకు ఎప్పుడు అందుబాటులో ఉండేలా అంబులెన్సులు ఉపయో గించుకోవచ్చని తెలిపారు. రోగుల కోసం ఏర్పాటు చేసే అంబులెన్సులు ఉచితంగా సేవలందిస్తారని, పేద ప్రజల ఆరోగ్యం కోసం టీడీపీ, తమ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన తెలుగు యువత నాయకులు



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆదోని, జనవరి 19: ఉండవల్లిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తన నివాసంలో ఆదోని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కాకర్ల వెంకటేష్ చౌదరి, యువ నాయకుడు మారుతి నాయుడు మర్యా దపూర్వకంగా కలిశారు. పాదయాత్ర దిగ్విజయంగా ముగించుకున్న సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానిం చారు. ఈసందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ యువత పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని లోకేశ్‌ను నాయకులు కోరారు. తెలుగు యువత నాయకులు వినయ్, జేపీ వెంక టేష్, లోకేష్, సురేష్ నాయుడు, భరత్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

ఆదోని టౌన్, జనవరి 19: పట్టణంలోని వివిధ తరగతులలో టాపర్లుగా నిలిచిన 51 మంది విద్యార్థులకు మహాయోగి లక్ష్మమ్మ కో-ఆప రేటివ్ బ్యాంక్ లిమిటెడ్ వారు శుక్రవారం రాత్రి బంగారు పతకాలను బహూకరించారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఒకేషనల్ కోర్స్, పాలిటెక్నిక్, ఇంజనీ రింగ్‌లలో టౌన్ టాపర్లుగా ఎంపికైన వారికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐఆర్ఎస్ అధికారి కల్లిగట్టు నాగరాజు, జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ ఎన్ రామాంజ నేయులు, డీఎస్పీ శివనారాయణ స్వామి బంగారు పతకాలను బహూకరిం చారు. ఈ కార్యక్రమం అవ్వ బ్యాంక్ వ్యవస్థాపక ఛైర్మన్ రాబోటి రామయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మిరియాల భద్రీనాథ్, మార్కెట్ యార్డు ఛైర్మన్ మజర్ అహమ్మద్, ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం సభ్యుడు నసీరుద్దీన్ పటేల్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు దేవిశెట్టి ప్రకాష్, అవ్వబ్యాంక్ వైస్ ఛైర్మన్ బాదామి లక్ష్మయ్య శెట్టి పాల్గొన్నారు.

అంధకారంలో బనవాసి ఎస్సీ కాలనీ

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 19: మండల పరిధిలోని బనవాసి ఎస్సీ కాలనీ, జవహర్ నవోదయ సమీపంలో ఉన్న కాలనీలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర మాన్‌దొడ్డి క్రాసింగ్‌లో ఉన్న కాలనీలో విద్యుత్ సరఫరా కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిపూట కాలనీ వాసులు ఆరు బయటకు రావడానికి భయపడతున్నారు. రాత్రి వేళల్లో విష సర్పాలు, నక్కలు, తోడేళ్ల కాలనీ సమీపంలో సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా వీధి దీపాలు వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మంత్రాలయం మఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, జనవరి 19: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన అజ్ఞాత భక్తుడు రూ.లక్ష విరాళంగా ఇ చ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేం ద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును విరాళం ఇచ్చినట్లు వెల్లడించారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబ సభ్యులకు పీఠాధిపతి సు బుధేంద్ర తీర్థులు మెమొంటో, శేషవస్త్రం, ఫల పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

గోనెగండ్ల, జనవరి 19: అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. శుక్రవారం గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే హాజరు పట్టికను పరిశీలించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది హనుమంతు, పరమేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, వైద్యులు మనోజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను విస్మరిస్తే ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

పత్తికొండటౌన్, జనవరి19: దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తే పాలక ప్రభుత్వాన్ని గద్దెదింపుతామని వికలాంగుల సంక్షేమ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నాగరాజు, రవిప్రకాష్‌లు హెచ్చరించారు. శుక్రవారం సహకార కేంద్ర బ్యాంక్ ప్రాంగణంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఏజెసీ సమావేశం జరి గింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. నాయకులు యల్లప్ప, నాగరాజు, ఈరన్న, సురేష్ ఉన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

ఆలూరు రూరల్, జనవరి 19: అంగన్‌వాడీలను చులకనగా చూస్తున్న ప్రభుత్వానికి సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెబుతామని సీఐటీయూ మండల కార్యదర్శి షాకీర్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకురాలు జయశ్రీ, బాలరంగమ్మ హెచ్చరిం చారు. శుక్రవారం సీఐటీ యూ ఆధ్వర్యంలో 39వ రోజు సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు అంబేడ్కర్ సర్కిల్లో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ, డీవైఎఫ్ఐ నాయకులు మైన, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భార తి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ఆదోని: ఆదోనిలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, వరలక్ష్మీ, సరోజ, జానకీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మీనాకుమారి, గీత, విమల, కరుణ, పద్మ, సోమక్క, లలిత, ఉమ, లక్ష్మీదేవి, సుజాత, సుగుణ మ్మ, శాంతమ్మ, రమణమ్మ, రంగమ్మ, రేణుక, శారద పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: సీఎం జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవి ష్కరించే అర్హత లేదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు గ్రేసమ్మ, కృష్ణవేణమ్మ, నాగవేణి, అన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు అంబే డ్కర్ సర్కిల్‌లో బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కలించాలని, అలాగే న్యాయం పరమైన కొర్కెలను తీర్చాలన్నారు. ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రమోగించినంత మాత్రనా భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ నాయకులు రాముడు, తిమ్మగురుడు, రాజు పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారానికి 39రోజుకు చేరింది. పత్తికొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో దీక్షా శిబిరం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు కాశీ విశ్వనాథ్, గోపాల్, అంగన్‌వాడీలు కాంతమ్మ, పద్మజ, మాధురి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: అంగన్‌వాడీల సమస్యలు 39 రోజులుగా చేస్తున్న జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని అంగన్‌వాడీ యూనియన్ వర్కర్ల ప్రాజెక్టు అధ్యక్షురాలు విశాలాక్షి, ప్రమీల, భీమేశ్వరి అన్నారు. శుక్రవారం మంత్రాలయంలో ఐసీడీఎస్ కార్యాలయం ముందు 39 రోజులకు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ అంగన్ వాడీ వర్కర్లపై కక్షపూరితంగా నోటీసులు, ఎస్మా చట్టాన్ని ప్రయోగించి భయపెట్టిస్తే బెదిరేది లేదని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పత్తికొండటౌన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని చేప ట్టిన నిరాహార దీక్ష శుక్రవారానికి 39రోజుకు చేరింది. పత్తికొండలో సీఐ టీయూ ఆధ్వర్యంలో దీక్షా శిబిరం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యద ర్శులు కాశీ విశ్వనాథ్, గోపాల్, అంగన్‌వాడీలు కాంతమ్మ, పద్మజ, మాధురి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: వెల్దుర్తిలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె 39వ రోజుకు చేరుకుంది. శుక్రవారం వెల్దుర్తి ప్రాజెక్టు కార్యదర్శి ఎస్ చాందిని ఆధ్వర్యం లో నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో శిరీష, వెంకటేశ్వరమ్మ, గం గావతి, పుష్పావతి, సావిత్రి పాల్గొన్నారు.



వెల్దుర్తిలో 39 సంఖ్య ఆకారంలో కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఎమ్మిగనూరులో..

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

తుగ్గలి, జనవరి 19: చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని, తుగ్గలి నాగేంద్ర తన అనుచరులతో టీడీపీలోకి రావాలని ఆ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా ఇన్‌చార్జి కెఎల్ ప్రభాకర్‌చౌదరి కోరారు. శుక్రవారం తుగ్గలిలో రాష్ట్ర మాజీ శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర, వరలక్ష్మి దంపతులను ఆయన నివాసంలో కలిశారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు మనోహర్‌చౌదరి, సురేష్‌చౌదరి, శివరాముడు చౌదరి, వెంకటస్వామి, విజయభాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీతారామ లక్ష్మణ విగ్రహాల బహూకరణ

మద్దికెర, జనవరి 19: మండలంలోని పెరవలి గ్రామంలోని రంగనా థస్వామి దేవాలయానికి దాత పారా రామన్న కుటుంబీకులు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టెన్న) సీతారామ లక్ష్మణ విగ్రహా లను బహూకరించారు. శుక్రవారం దాతల ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలతోపాటు అయోధ్య రాములోరి తలంబ్రాలను ఇంటింటికి పంపి ణీ చేశారు. 22న అయోధ్య ఆలయంలో శ్రీరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠిం చిన రోజు పెరవలి రంగనాథస్వామి ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠిస్తా మని తెలిపారు. ఆలయ ఛైర్మన్ దస్తగిరిగౌడ్ పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి

దేవనకొండ, జనవరి 19: ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం వెంటనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌కు వినతి పత్రం ఇచ్చా రు. కార్యక్రమంలో రైతుసంఘం, సీపీఐ నాయకులు రామాంజినేయులు, వీరస్వామి, హుసేని, వెంకటేశ్, రవి, బాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 19: మండల పరిధిలోని రాళ్లదొడ్డి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. ముగతి గ్రామానికి చెందిన నరసింహులు ఎమ్మిగనూరు నుంచి కర్నూలు కు బైక్‌పై బయలుదేరాడు. కర్నూలు నుంచి వస్తున్న ఐచర్ వాహనం రాళ్లదొడ్డి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నాయక్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మంత్రాలయం, జనవరి 19: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో భీరప్ప గుడి దగ్గరలో పేకాటాడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు మాధవ రం ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు. సమచారం రావడంతో శుక్రవారం దాడులు నిర్వహించి చేసి అదే గ్రామానికి చెందిన నలుగురిని అరెస్టు చేసి రూ.5,630 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ తెలిపారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

గోనెగండ్ల, జనవరి 19: రైతు భరోసా కేంద్రాల సేవలను ఆయా ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ ఫార్మ సీడ్స్ అధికారి శైలకుమారి కోరారు. శుక్రవారం మం డల కేంద్రమైన గోనెగండ్లలోని పలు గ్రామాలలోని రైతుభరోసా కేంద్రా లను వారు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

22న శ్రీరాముని శోభా యాత్ర

కోసిగి, జనవరి 19: కోసిగిలోని ఆదోని రోడ్డులో వెలసిన శ్రీరామ దేవాలయం నుంచి 22న శ్రీరాముని శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు తెలిపారు. కోసిగిలోని శ్రీరా మ దేవాలయం నుంచి రామ్‌లీలా చిత్రపటాన్ని వీధుల గుండా శోభా యాత్రగా ఊరేగించిన అనంతరం శ్రీ ఎల్లమ్మ దేవాలయం ఆవరణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి రూ.10వేలు విరాళాన్ని వ్యవసాయ సలహా మండలి అధ్య క్షుడు మురళీరెడ్డి కమిటీ సభ్యులకు అందజేశారు. అయోధ్య నగరంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ 22న జరుగుతుందని, కోసిగిలో కూడా శ్రీరాముని దేవాలయంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బెట్టన్నగౌడు, నాగరాజు, ముకుంద కృష్ణమూర్తి, భోంపల్లి వెంకటేశ్, హుశేనీ, రామాంజని తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

వెల్దుర్తి, జనవరి 19: పట్టణంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్ర వారం మండల కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబి రసూల్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. గ్రామా ల్లో పనులు లేక వలసలు వెళ్తున్నారన్నారు.